క్లుప్తంగా

ర్యాలీలకు అనుమతి లేదు


మాట్లాడుతున్న సీఐ మోహన్

ఖానాపూర్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సందర్భంగా ఆదివారం ర్యాలీలు, వేడుకలకు అనుమతి లేదని ఖానాపూర్ సీఐ మోహన్ అన్నారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్, 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున బాణసంచా పేలడం, డీజేలు పెట్టడం, గుంపులుగా తిరగడం, ర్యాలీలు పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముధోల్/కడెం/కుంటాల/లక్ష్మణచాంద/సోన్/పెంబి: ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేవని ముధోల్ సీఐ వినోద్‌రెడ్డి, సోన్ సీఐ నవీన్ కుమార్, ఎస్సైలు కొసన రాజు, హన్మాండ్లు, రజనీకాంత్ వేర్వేరుగా ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఊరేగింపునకు అనుమతి వచ్చాకే జరుపుకోవాలని సోన్ సీఐ సూచించారు.

'ఏలేటి' గెలవాలని పూజలు


పూజ చేస్తున్న శ్రీనివాస్

లక్ష్మణచాంద: నిర్మల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గెలుపొందాలని మండల కేంద్రానికి చెందిన ఎర్రవోయిన శ్రీనివాస్ శనివారం బద్ది పోచమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఏలేటిపై తనకున్న అభిమానం చాటుకున్నాడు.

నిరుపేద యువతి వివాహానికి చేయూత


పుస్తెమెట్టెలు అందజేస్తున్న కృష్ణంరాజు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన నిరుపేద యువతి వివాహానికి మంత్రి ఐకేరెడ్డి పీఏ కృష్ణంరాజు చేయూతనిచ్చారు. కాలనీలోని అల్లెపు నర్సవ్వ-వెంకటి దంపతుల కూతురు నర్సవ్వ వివాహానికి పసుపు, కుంకుమతోపాటు రూ.7 వేల విలువైన పుస్తెమెట్టెలను శనివారం అందజేశారు. నాయకులు శ్రీనివాస్, భీమన్న, కిషన్, రమేశ్, భీమేశ్, పృథ్వీరాజు, మల్లయ్య ఉన్నారు.

ఘనంగా మహాపడి పూజోత్సవం

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన సగ్గం రాజు గురుస్వామి ఆధ్వర్యంలో తన నివాసంలో శుక్రవారం మహాపడి పూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలాల నుంచి పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు తరలివచ్చి పడిపూజలో పాల్గొన్నారు. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

4న మహా పడిపూజ

కుంటాల: మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో ఈనెల 4న సోమవారం అయ్యప్ప మహా పడిపూజను గురుస్వామి సిర్పూర్ రాజేశ్వర్ నారికేళ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కుంటాల అయ్యప్ప సేవా సమితి సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నవీపేట్ అయ్యప్ప స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు శశాంక్ జోషి ఆధ్వర్యంలో నిర్వహించే పడిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తాంసి: దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని భీంపూర్ ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగపెల్లి జ్ఞానేశ్వర్ సూచించారు. శనివారం భీంపూర్ మండలంలోని జల్‌కోరి, అందర్‌బంద్ గ్రామాల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గంగాధర్, ఏఎన్‌ఎం సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

'గెర్కిన్' సాగు..లాభాలు బాగు

- పంట సాగుతో అధిక దిగుబడులు
- లాభాలు గడిస్తున్న రైతులు


దోసకాయ తెంపుతున్న రైతులు


పీచరలో సాగవుతున్న గెర్కిన్ దోస

లక్ష్మణచాంద: మూసధోరణిలో ఒకే రకం కాకుండా లక్ష్మణచాంద మండలానికి చెందిన పలువురు రైతులు గెర్కిన్ సాగు చేసి లాభాలు గడిస్తున్నారు. పీచర, మల్లాపూర్, పార్‌పెల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఈ పంట సాగుచేశారు. అధిక ఆదాయం వచ్చే గెర్కిన్ సాగు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. మల్లాపూర్‌లో 30 మంది, పీచరలో 40, పార్‌పెల్లిలో 30 మంది సమూహంగా చేరి ఆర్మూర్‌కు చెందిన ఓ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని వంద ఎకరాల్లో గెర్కిన్ దోసకాయ సాగు చేస్తున్నారు. విత్తనాలు ఇచ్చిన కంపెనీ.. పంట సాగుకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు ఇచ్చింది. సాగు చేసే క్రమంలో సలహాలు, సూచనలు చేశారు. ప్రస్తుతం పంట చేతికి రావడంతో దోస కాయలను వారే బై బ్యాక్ పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు.

రోజు విడిచి రోజు ఆదాయం

గెర్కిన్ దోస పంట 75 రోజుల పంట. ఇది వేసిన నెల తర్వాత కాత ప్రారంభమవుతుంది. కాత రెండు నెలలు ఉంటుంది. కాత ప్రారంభమైన తర్వాత కాయలను రైతులు రోజు విడిచి రోజు తెంపుతున్నారు. దీంతో వారికి ఆదాయం వస్తుంది. దోస కాయ క్వింటాల్ రూ.900 ఉంది. ఎకరంలో సాగు చేస్తే 80–100 క్వింటాళ్ల వరకు దోస కాయలు వస్తాయని రైతులు అంటున్నారు. పెట్టిన పెట్టుబడి రూ.20 వేలు పోను సుమారు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందని చెబుతున్నారు.

పంటకు డిమాండ్

గెర్కిన్ జాతికి చెందిన దోస కాయలను విదేశాల్లో పలు కాస్మోటిక్స్, ఔషధాల తయారీల్లో వినియోగించడంతో ఈ పంటకు డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి చాలా కంపెనీలు విదేశాలకు దోసను ఎగుమతి చేస్తున్నాయి.

పంట ఆశాజనకంగా ఉంది



ఎకరంలో గెర్కిన్ దోస సాగు చేస్తున్నాను. పంటకు ఎలాంటి తెగులు లేకుండా ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పంట చేతికి వచ్చింది. రోజు విడిచి రోజు 10 క్వింటాళ్లకు రూ.9,500 వస్తోంది.

– బుర్రి భూమేశ్, రైతు, పీచర

ఆదాయం వస్తుంది



గెర్కిన్ దోస పంట సాగు చేస్తే తక్కువ సమయంలో ఆదాయం వస్తుంది. 75 రోజుల్లోనే పంటకు ఆదాయం, లాభాలు వస్తాయి. కంపెనీ వారే తమ గ్రామానికి వచ్చి పంటను కొనుగోలు చేస్తున్నారు.– మహేశ్, రైతు, మల్లాపూర్

ప్రయాణం నరకప్రాయం


కన్నపూర్-అష్టా తారురోడ్డుపై ఏర్పడిన గుంత

- ఐదేళ్లకే లేచిపోయిన తారురోడ్డు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

లోకేశ్వరం: గ్రామీణ రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. మండలంలోని కన్నపూర్ నుంచి అష్టా వరకు 2017–18లో రూ.కోటి 50 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో తారు రోడ్డును నిజామాబాద్‌కు చెందిన కన్‌స్ట్రక్షన్ నిర్మించింది. రోడ్డు నిర్మించినా ఐదేళ్లకే అధ్వానంగా తయారైంది. కంకరతేలి, గుంతలు దర్శనమిస్తున్నాయి. రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. ఏడాదిలో కురిసిన వర్షాలకు భారీ వరదలకు రోడ్లు కోతకు గురయ్యాయి. పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు ఓ గుంతను తప్పించే యత్నంలో మరో గుంతలో పడుతున్నారు. రాత్రివేళ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. అయినా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

మరమ్మతు చేపట్టాలి



హవర్గ–హత్‌గాం వరకు రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు గుండా ప్రయాణించాలంటే భయమేస్తోంది. రోడ్డుకు మరమ్మతు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

మురళీ, కన్నపూర్

నిధులు మంజూరు కాగానే

కన్నపూర్–అష్టా రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఈవిషయమై ఉన్నతాధికారులకు ఇదివరకే నివేదించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతు చేపడుతాం.

– రఘువంశీ, లోకేశ్వరం పీఆర్ జేఈ



అల్లుకున్న సారతీగ

కుంటాల: మండలంలోని అంబకంటి హనుమాన్ ఆలయం వెళ్లే మార్గంలో రెండు చెట్లను సార తీగ అల్లుకుంది. రెండు చెట్లపై గొడుగుల్లా అల్లుకున్న దృశ్యాన్ని చూసి ప్రకృతి ప్రేమికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వృథాగా పోతున్న నీరు



లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి జీపీ భవనం సమీపంలో ఫైబర్ గ్రిడ్ పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో పైప్‌లైన్ కోసం తవ్విన సమయంలో నీటిని సరఫరా చేసే పైప్‌నకు రంధ్రం ఏర్పడింది. అధికారులు వెంటనే పట్టించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతుల కష్టాలు




లోకేశ్వరం: జిల్లాలో వరి రైతులకు పుట్టెడు కష్టం వచ్చింది. గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. పొలాల్లో నీరు నిల్వ ఉండటంతో హార్వెస్టర్లు నడవడం లేదు. దీంతో రైతులు కూలీలతో వరికోతలు కోయించి కట్టలు కట్టి నేలపై సడెం కొడుతున్నారు. లోకేశ్వరం మండలం పంచగుడి పంచాయతీ పరిధిలోని మొహళ గ్రామ రైతు ఇలా సడెం కొట్టి ధాన్యం సేకరిస్తున్నాడు.




కార్మికులపై పట్టింపేది..

నిర్మల్‌లో పారిశుధ్య కార్మికులకు కనీస సౌకర్యాలు కానరావడం లేదు. చేతులు గ్లౌజులు, కాళ్లకు షూ ఇవ్వకుండా బల్దియా అధికారులు వారితో పనులు చేయిస్తున్నారు. పట్టణంలో చెత్తాచెదారం ఏరుతుండగా శనివారం సాక్షి క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

అటెన్షన్ ప్లీజ్

కోతకు గురైన రోడ్డు



తానూరు: ఉమ్రి(కే)–ఇలేగాం దారిలో వంతెన వద్ద భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు పట్టించుకుని రోడ్డుకు మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారి: జగదీశ్, పీఆర్‌ఏఈ, సెల్: 91211 35623

పంటలపై 'మిచాంగ్' ప్రభావం..!

- తగ్గిన తెల్ల బంగారం దిగుబడి
- వరి ధాన్యానికి మొలకలు
- ఆందోళనలో రైతాంగం


వెంకూర్‌లో దెబ్బతిన్న పత్తి

కుంటాల: మూలిగేనక్కపై తాటిపండు వచ్చి పడ్డ చందంగా మారింది రైతుల పరిస్థితి. ఈ వానాకాలంలో పంటలు సాగుచేసిన రైతులకు కన్నీళ్లే మిగిలాయి. సోయా దిగుబడులు పూర్తిగా నష్టాన్ని కలిగించాయి. వరి, పత్తి దిగుబడులు వస్తాయని అనుకుంటే మిచాంగ్ తుపాను ప్రభావంతో వారి ఆశలు అడియాశలు అయ్యాయి.

తగ్గిన దిగుబడులు

మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ వానాకాలంలో 12,550 ఎకరాల్లో పత్తి, 3,400 ఎకరాల్లో వరి పంటలు సాగుచేశారు. ఇటీవల తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. అకాల వర్షాలు కురవడంతో ప్రస్తుతం పత్తి నల్లబారింది. పేను సోకింది. పంటపై కాయను రసం పీల్చేపురుగు దాడిచేస్తోంది. వర్షం, తెగుళ్ల కారణంగా సగానికి పైగా దిగుబడులు పడిపోయాయి.

రోడ్డుపైనే ధాన్యం..
వర్షం వస్తే నష్టం

రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు రోజుల తరబడి తేమ శాతం రాక నిరీక్షిస్తున్నారు. కేంద్రాల వద్ద ఆరబెట్టేందుకు స్థలం లేక రైతులు రోడ్డుపైనే ధాన్యాన్ని ఆరబెట్టుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ప్రతీరోజు కారుమబ్బులు కమ్ముకోవడం, ఇటీవల కురిసిన అకాల వర్షంతో రోడ్లపై ఉన్న ధాన్యం తడసి మొలకలు వచ్చాయి. దీంతో తేమశాతం రాదని రైతులు మరింత దిగులు చెందుతున్నారు. రంగుమారిన పత్తిని, మొలకలు వచ్చిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కన్నీళ్లే వస్తున్నాయి



నాకున్న పొలంలో వరి పంట సాగు చేశాను. ధాన్యాన్ని అమ్మేందుకు కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకెళ్లా. ఇటీవల కురిసిన అకాల వర్షంతో ధాన్యం తడిసిముద్దయింది. దీంతో మొలకలు వచ్చాయి.

– రాజు, రైతు, అందాకూర్

దిగుబడులు తగ్గాయి



వానాకాలంలో 8 ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఇటీవల కురిసిన వర్షంతో పత్తి నేలవాలి నల్లరంగు మారింది. దీనికితోడు తేనె, పేను, ఆకు, కాయకు రసంపీల్చే తెగుళ్లు సోకడంతో దిగుబడులు తగ్గి ఆర్థికంగా నష్టపోయాను.–సిందె మనోహర్, రైతు, వెంకూర్

ఏబీవీపీ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలి


ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఢిల్లీలో ఈనెల 7 నుంచి 10వ తేదీల్లో నిర్వహించే 69వ ఏబీవీపీ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని నిర్మల్ జిల్లా కన్వీనర్ కైరి శశి పిలుపునిచ్చారు. ఏబీవీపీ ఇందూర్ శాఖ ఆధ్వర్యంలో దీక్ష జూనియర్ కళాశాలలో మహాసభల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కైరి శశి మాట్లాడుతూ మహాసభల్లో విద్యారంగ సమస్యలు, పలు అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఏబీవీపీ ప్రారంభమై 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా పదివేల మందికి ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. ముఖ్యఅతిథిగా ప్రధాని మోదీ హాజరవుతారని తెలిపారు. ఇందుర్ విభాగ్ ఎస్‌ఎఫ్‌ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రవణ్, భగవన్, దినేష్, రఘు, సన్ని పాల్గొన్నారు.

అన్నదానం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని దేవరకోట దేవస్థానం శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఈసహోయిన రిషిత–దేవేందర్ యాదవ్ దంపతులు తమ కూతురు జన్మదినం సందర్భంగా అయ్యప్ప స్వాములు, 1500 మంది భక్తులకు అన్నదానం చేశారు. అంతకుముందు ఆలయంలో వైభవంగా పల్లకీసేవ, స్వామివారికి పంచామృత అభిషేకాలు చేపట్టారు. ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, కౌన్సిలర్లు నరేందర్, ఎస్పీ రాజు, మేడారం అపర్ణ, జగడం రాజు పాల్గొన్నారు.

ధాన్యం తూకంలో కోతలు సరికాదు


కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న నాయకులు

ఖానాపూర్: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే అధికారులు ఇష్టారాజ్యంగా కోతలు విధించడం సరికాదని ప్రజాసంఘాల పోరాట కన్వీనర్ నూతన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం రైతులతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 కిలోల బస్తా బరువు పేరిట కిలో కోత విధించడంతోపాటు అదనంగా మరో కిలో కోత విధించడం సరికాదన్నారు. అధికారులు తీరు మార్చుకోవాలని లేకపోతే లేకపోతే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు నర్సయ్య, శంభు, నారాయణ తదితరులు ఉన్నారు.

5 నుంచి బోర్లకుంట జాతర

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి, నిపాని గ్రామాల మధ్య ఉన్న దవల్‌మాలిక్ బాబా (బోర్లకుంట) జాతర 5వ తేదీ నుంచి జరగనుంది. దీంతో జాతర కమిటీ సభ్యులు జాతర ఏర్పాట్లు శనివారం పూర్తి చేశారు. మూడు రోజుల పాటు జరిగే జాతర ఉత్సావాలకు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలతో పాటు, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు ఖాశీం, నిపాని సర్పంచ్ రాజన్న, పిప్పల్‌కోటి సర్పంచ్ గంగయ్య తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న నిర్వాహకురాలు

ఆదిలాబాద్‌రూరల్: బాలికలకు, మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి అన్నారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచారోద్యమంలో భాగంగా శనివారం మావల మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించారు. ఈనెల 10న నిర్వహించనున్న మానవ హక్కుల దినోత్సవం వరకు స్త్రీలకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. టెక్నాలజీ ఎంత పెరిగినా.. మహిళలపై, చిన్నారులపై హింసలు ఆగడం లేదన్నారు. సఖీ కేంద్రం సిబ్బంది లావణ్య, పాఠశాల ప్రిన్సిపాల్ రేవరల్ టామి, జీన్స్ థామస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.